దేశంలో ఇండియా కూటమి ప్రభావం జీరో

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆర్జేడీలో జేడీయూ విలీనం:పీకే

న్యూఢిల్లీ, నవంబర్ 23: దేశంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ప్రభావం ఏమాత్రం లేదని, అది 'జీరో' అని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. ఇండియా కూటమి నేతలు కేవలం ఒక్కచోట సమావేశమై చర్చలు జరిపి, చాయ్ తాగేసి, మీడియాతో మాట్లాడినంత మాత్రాన దేశమంతటా ప్రజల్లో చైతన్యం రాదని పేర్కొన్నారు. గత ఆరు నెలల్లో ఇండియా కూటమి చేసిందేమిటని ఆయన ప్రశ్నించారు. యూపీఏ పేరును ఇండియా కూటమిగా మార్చడం తప్ప వారు ఏమీ చేయలేదని అన్నారు. తమ ఉమ్మడి నాయకుడెవరో చెప్పలేకపోయారని, తమ విధానాలు ప్రకటించలేకపోయారని, కనీసం కూటమి ఆధ్వర్యంలో ఒక్క ఆందోళన కార్యక్రమం కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. బీహార్ సీఎం నితీశ్‌కుమార్, ఆర్జేడీ నేతలు లాలూ యాదవ్, తేజస్వీ యాదవ్ తదితరులు సొంత రాష్ట్రంలో ప్రభావం చూపగలరేమో కానీ దేశవ్యాప్తంగా ప్రభావం చూపగల బలం వారికి లేదని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూకు ఐదు సీట్లు కూడా రావని, ఆ పార్టీ ఆర్జేడీలో విలీనం అవుతుందని జోస్యం చెప్పారు.

డీప్‌ఫేక్‌లు సృష్టిస్తే భారీ జరిమానా

న్యూఢిల్లీ, నవంబర్ 23: డీప్ ఫేక్ వీడియోల నియంత్రణకు కేంద్రం చర్యలకు ఉపక్రమించింది. డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించేవారికి, అలాంటి వీడియోలను వ్యాప్తి చేసే సోషల్ మీడియా సంస్థలకు భారీ జరిమానాలు విధిస్తామని కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ అంశానికి సంబంధించి నూతన నిబంధనావళిని రూపొందిస్తున్నామని, 10 రోజుల్లో అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు. డీప్‌ఫేక్స్ టెక్నాలజీతో మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు సోషల్‌మీడియాలో వెలువడటంపై పలువురు సెలబ్రిటీలు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ అంశంపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం సోషల్‌మీడియా కంపెనీల ప్రతినిధులు, నాస్కామ్, కృత్రిమ మేధ నిపుణులు తదితరులతో సమావేశమయ్యారు. వీడియోల కట్టడిపై సమావేశంలో చర్చించారు.

ప్రకాశ్‌రాజ్‌కు ఈడీ సమన్లు

చెన్నై, నవంబర్ 23: మనీలాండరింగ్ కేసులో ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సమన్లు జారీచేసింది. వచ్చే వారం చెన్నైలోని ఈడీ కార్యాలయంలో దర్యాప్తు బృందం ముందు హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నది. ఆయన బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న తమిళనాడుకు చెందిన 'ప్రణవ్ జ్యువెలరీ'పై ఈడీ కేసులకు సంబంధించి ఆయన్ని విచారించబోతున్నది. పోంజీ స్కీమ్‌లో రూ.100 కోట్ల మనీలాండరింగ్ పాల్పడ్డారని ప్రణవ్ జ్యువెలరీ యజమాని మదన్, ఆయన భార్యపై ఈడీ లుకౌట్ నోటీసులు జారీచేసింది. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ సినిమాల్లో తనదైన నటనతో దేశవ్యాప్తంగా గుర్తింపు అందుకున్న ప్రకాశ్ రాజ్, ప్రధాని మోదీ, బీజేపీ విధానాలను సునిశితంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఈడీ సమన్లు జారీ చేయడం చర్చనీయాంశం అయింది.

బెంగళూరులో కాంగ్రెస్ పడగ.. రియల్టీ ఉల్టాపల్టా

- సిలికాన్ సిటీలో భారీగా పడిపోయిన భూముల ధరలు
- ఆర్నెల్ల కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు
- రెసిడెన్షియల్, కమర్షియల్.. అన్ని భూముల ధరలూ పతనం
- వెస్టియన్, సీబీఆర్ఈ, కుష్మన్ అండ్ వెక్‌ఫీల్డ్, అనరాక్ వంటి ప్రఖ్యాత రియల్ ఎస్టేట్ సంస్థల నివేదికలే రుజువు
- కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్న బెంగళూరు రియల్టర్లు
- పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో రియల్ బూమ్
- రియల్‌ఎస్టేట్ రంగంలో టాప్ ప్లేస్ దిశగా మన భాగ్యనగరం
- ఆదమరిచి కాంగ్రెస్‌కు ఓటేస్తే.. మన భూములన్నీ మళ్లీ బుగ్గే
- కాంగ్రెస్ వస్తే రియల్ ఎస్టేట్ ఢాం: మంత్రి కేటీఆర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో కర్ణాటక అస్తవ్యస్తంగా మారింది. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పిలిచే బెంగళూరులో రియల్ ఎస్టేట్ నీటి బుడగలా పేలిపోయింది. కాంగ్రెస్ సర్కారు అసమర్థ విధానాలు, ప్రభుత్వంలో పేరుకుపోయిన అవినీతి, పాలసీల అమలులో వేగంలేకపోవడంతోనే కొనుగోలుదారులు, పారిశ్రామికవేత్తలు ఇతర నగరాలకు వెళ్తున్నారని స్థిరాస్తిరంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. నగరంలోని ఇండిపెండెంట్, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ తదితర నివాస గృహాలు, ఆఫీసు స్పేస్ లీజులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య, అగ్రి అవసరాలకు సంబంధించిన అన్ని భూముల విక్రయాలు భారీగా పతనమైనట్టు బెంగళూరు రియల్టర్లు లబోదిబోమంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కారణంగానే ఈ దుస్థితి దాపురించినట్టు మండిపడుతున్నారు.

ఆఫీస్ స్పేస్ లీజుల్లో పతనం

బెంగళూరులో ఆఫీస్ స్పేస్ లీజింగ్ అంతకంతకూ పడిపోతున్నదని ప్రముఖ రియల్టీ కన్సల్టెంట్ వెస్టియన్ తాజా నివేదికలో వెల్లడించింది. ఈ ఏడాది మూడో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో బెంగళూరు ఆఫీస్ స్పేస్ లీజులు 36 లక్షల చదరపు అడుగులకే పరిమితమయ్యాయని, నిరుడు జూలై-సెప్టెంబర్ (క్యూ3)లో నమోదైన గ్రాస్ లీజింగ్ 50 లక్షల చదరపు అడుగులతో పోలిస్తే, ఈసారి లీజింగ్ 28 శాతం తగ్గుముఖం పట్టిందని వెల్లడించింది. ఇదే సమయంలో హైదరాబాద్‌లో లీజులు ఏకంగా 270 శాతం పెరిగినట్టు వివరించింది. ఇక, ఎత్తైన భవనాల నిర్మాణం కూడా బెంగళూరులో అంతకంతకూ పడిపోతున్నదని.. ఈ జాబితాలో 8 శాతం వాటాతో హైదరాబాద్ టాప్‌లో ఉండగా, కేవలం ఒక్కశాతం వాటాతో బెంగళూరు అట్టడుగున ఉన్నట్టు ప్రముఖ రియల్ ఎస్టేట్ సర్వీసెస్ సంస్థ కోల్డ్‌వెల్ బ్యాంకర్ రిచర్డ్ ఎల్లిస్ (సీబీఆర్ఈ) ఏషియన్ ప్రైవేట్ లిమిటెడ్ వెల్లడించిన సర్వేలో తేలింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నివాస గృహాల ధరలు 33 శాతం మేర పెరగ్గా, బెంగళూరులో కార్పొరేట్ ఆఫీసులకు అడ్డాగా పిలిచే వైట్‌ఫీల్డ్‌లో 29 శాతం కూడా వృద్ధి కనిపించలేదని అనరాక్ సంస్థ తాజా నివేదికలో తెలిపింది. లగ్జరీ ఇండ్ల నిర్మాణం, అమ్మకాల్లో 14,340 యూనిట్లతో హైదరాబాద్ టాప్ ప్లేస్‌లో ఉంటే, 1,710 యూనిట్లతో బెంగళూరు అంతకంతకూ దిగజారుతున్నట్టు అనరాక్ గ్రూప్ మరో నివేదికలో వివరించింది.

ఇప్పుడు తెలంగాణపై గురి

బీఆర్ఎస్ పాలనలో యావత్తు తెలంగాణలో భూముల ధరలు బంగారమయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సులభతర పారిశ్రామిక విధానంతో దేశ విదేశాల్లోని ప్రఖ్యాత కంపెనీలు హైదరాబాద్‌కు క్యూ కట్టాయి. దీంతో నగరంలో భూముల ధరలు వందలరెట్లు పెరిగిపోయాయి. దక్షిణాసియాలోనే ఖరీదైన ప్రాంతాల జాబితాలో గచ్చిబౌలి, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పేర్లు ఉన్నాయంటే అతిశయోక్తికాదు. అందుకే, ఇప్పుడు కాంగ్రెస్ నేతల కండ్లు భాగ్యనగరం భూముల మీద పడ్డాయి. ఆరు నెలల్లోనే బెంగళూరు రియల్‌ఎస్టేట్‌ను అస్తవ్యస్తం చేసిన హస్తంపార్టీ నాయకులు తమ మాయ మాటలతో ఇక్కడి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని అనుకొంటున్నారు. ఆదమరిచి ఓటేస్తే, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కూడా బెంగళూరు మాదిరిగా కుదేలవ్వడం ఖాయమని తెలంగాణవాదులు హెచ్చరిస్తున్నారు.

తగ్గిన ఇండ్ల అమ్మకాలు

జూన్-జూలైనాటికి బెంగళూరులో ఇండ్ల అమ్మకాలు 19 శాతం మేర పడిపోయినట్టు ప్రాప్‌టైగర్ మరో నివేదికలో తెలిపింది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో ఆఫీస్ స్థలానికి బెంగళూరులో డిమాండ్ 39 శాతం మేర పడిపోయినట్టు కుష్మన్ అండ్ వెక్‌ఫీల్డ్ నివేదికలో వెల్లడించింది. గడిచిన ఆరు నెలల వ్యవధిలో బెంగళూరులోని రెసిడెన్షియల్ ల్యాండ్స్, బిల్డింగ్స్, ఆఫీసు స్పేస్ లీజులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య, అగ్రిఅవసరాలకు సంబంధించిన అన్ని భూముల ధరలు మునపటితో పోలిస్తే, భారీగా పతనమైనట్టు నైట్ ఫ్రాంక్, నరెడ్కో, క్రెడాయ్, క్రిసిల్, సీబీఆర్ఈ, కొల్లీర్స్ ఇండియా, ఎన్‌హెచ్‌బీ తదితర సంస్థల నివేదికల్లో వెల్లడైంది.

కాంగ్రెస్ వస్తే రియల్ ఎస్టేట్ ఢాం

కాంగ్రెస్‌లో ఆరు నెలలకు ఓ సీఎం మారుతాడు. ఇలాంటి సమయంలో పాలసీల అమలుకు తావెక్కడుంటుంది? చిన్న నిర్ణయం తీసుకోవాలన్నా.. ఢిల్లీ మీదే ఆధారపడే అసమర్థులున్న ఆ పార్టీ.. స్థిరమైన నిర్ణయాలను వేగంగా ఎలా అమలుచేయగలదు. అందుకే, బెంగళూరులో రియల్ ఎస్టేట్ ఢాం అన్నది. కాంగ్రెస్ వచ్చిన తర్వాత బెంగళూరు ఆఫీస్ స్పేస్ లీజింగ్ 28 శాతం మేర పడిపోయిందని వెస్టియన్ నివేదిక చెప్పింది. ఇదే సమయంలో హైదరాబాద్ శరవేగంగా వృద్ధి చెందుతున్నది.

– ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

డీకేపై సీబీఐ కేసు వెనక్కి!

ప్రతిపాదనలకు కర్ణాటక సర్కార్ ఆమోదం

బెంగళూరు, నవంబర్ 23: అక్రమాస్తుల కేసులో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌పై సీబీఐ చేస్తున్న దర్యాప్తును ఉపసంహరించాలన్న ప్రతిపాదనకు ఆ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గం గురువారం ఆమోదించింది. దీంతోపాటుగా కేసు దర్యాప్తును రాష్ట్ర పోలీసు విభాగం లేదా లోకాయుక్తకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఓకే చెప్పింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఐటీ విభాగం 2017లో డీకే శివకుమార్ ఇండ్లు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. ఐటీ సోదాల ఆధారంగా డీకేపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఆ తర్వాత ఈ కేసును గత బీజేపీ ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఈ ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ డీకే హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయన అభ్యర్థనను న్యాయస్థానం ఏప్రిల్‌లో తిరస్కరించింది.

అమెరికాలో భారత మెడికో దారుణ హత్య

వాషింగ్టన్: అమెరికాలో భారత్‌కు చెందిన మరో విద్యార్థి హత్యకు గురయ్యాడు. ఒహియోలోని యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటీ మెడికల్ స్కూల్‌లో చదువుతున్న ఢిల్లీకి చెందిన 26 ఏండ్ల ఆదిత్య అద్లఖ దుండగుల కాల్పుల్లో మృతిచెందాడు. ఈ నెల 9న ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెస్టన్ హిల్స్ వయాడక్ట్‌లో ఓ కారు గోడను ఢీకొట్టి ఆగిపోయింది. దాని నిండా బుల్లెట్ రంధ్రాలు ఉండడం, లోపల ఓ యువకుడు రక్తపు మడుగులో పడి ఉండడంతో వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఆదిత్యను దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత మరణించాడు.

రూ.350 కోసం ఢిల్లీలో టీనేజర్ హత్య

60 సార్లు పొడిచిన బాలుడు

న్యూఢిల్లీ, నవంబర్ 23: కేవలం రూ.350 కోసం 16 ఏండ్ల యువకుడు మరో టీనేజర్‌ను అత్యంత పాశవికంగా హత్య చేశాడు. ఈశాన్య ఢిల్లీలోని వెల్‌కమ్ ఏరియాలో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యింది. టీనేజర్ తల, మెడ, కంటిపై నిందితుడు 60 సార్లు కత్తితో పొడిచి.. అత్యంత కర్కశంగా వ్యవహరించాడు. తల నరికేందుకు ప్రయత్నించటం, ప్రాణాలు కోల్పోయిన టీనేజర్‌ను చూసి.. యువకుడు డ్యాన్స్ చేయటం సీసీటీవీ వీడియోలో కనపడింది. ఈ దారుణ హత్యకు పాల్పడ్డ 16 ఏండ్ల యువకుడ్ని బుధవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు.

అంతరిక్షం నుంచి తొలి లేజర్ సందేశం

న్యూయార్క్: అంతరిక్ష ప్రయోగాల్లో అద్భుతమైన ముందడుగు పడింది. అంతరిక్షంలోని 16 మిలియన్ కిలోమీటర్ల నుంచి భూమిపైకి తొలి లేజర్ సందేశం అందింది. నాసా ప్రకారం.. ఇది భూమి, చంద్రుడి మధ్యదూరం కంటే 40 రెట్లు ఎక్కువ. ఇది ఆప్టికల్ కమ్యూనికేషన్ రంగంలోనే అతి గొప్ప మైలురాయి. ఈ ప్రయోగం డీప్ స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్స్ (డీఎస్‌ఓసీ) అనే సాధనం ద్వారా సాధ్యమైంది. ఈ సాధనాన్ని ఈ ఏడాది అక్టోబర్ 13న ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్‌నుంచి అంతరిక్షంలోకి ప్రయోగించిన సైక్ స్పేస్‌క్రాఫ్ట్‌లో పంపించారు. ఆ మరుసటి రోజునుంచే ఈ సాధనం లేజర్ సందేశాన్ని భూమిపైకి పంపిస్తున్నది.

టన్నెల్‌లో ఆగిన డ్రిల్లింగ్

శుక్రవారం మళ్లీ మొదలు..

న్యూఢిల్లీ, నవంబర్ 23: ఉత్తరాఖండ్ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న 41మంది కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌కు తుది దశలో అనుకోని అవాంతరం ఎదురైంది. అయితే సొరంగం లోపు లున్న కార్మికులు సురక్షితంగా ఉన్నారని అధికారులు గురువారం రాత్రి వెల్లడించారు. కార్మికులు చిక్కుకుపోయిన చోటకు కొన్ని మీటర్ల దూరంలో గురువారం డ్రిల్లింగ్ మిషన్ పలుమార్లు ఆగిపోయింది. మిషన్‌కు పలుచోట్ల పలుగులు ఏర్పడ్డాయి. దీనిపై ఇంటర్నేషనల్ టన్నెలింగ్ నిపుణుడు ఆర్నాల్డ్ డిక్స్ మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం తిరిగి డ్రిల్లింగ్ మొదలుపెడతామని చెప్పారు.

రాజస్థాన్ రాజెవరో?

రేపే పోలింగ్.. ప్రచారానికి తెర

- అంతర్గత కుమ్ములాటలతో కాంగ్రెస్ సతమతం
- ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాపైనే బీజేపీ భారం



జైపూర్, నవంబర్ 23: రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో గురువారం సాయంత్రంతో ప్రచార పర్వం ముగిసింది. గత నెలన్నర రోజులుగా హోరెత్తిన మైకులు మూతపడ్డాయి. రాజస్థాన్‌లో 200 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. కరన్‌పూర్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్ సింగ్ ఇటీవల మరణించారు. దీంతో మిగిలిన 199 నియోజకవర్గాలకు ఒకే విడతగా శనివారం(ఈ నెల 25న) పోలింగ్ జరుగనున్నది. దాదాపు 5.25 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రాష్ట్రంలో శాంతియుతంగా ఎన్నికల నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలుగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ ప్రచారంతో హోరెత్తించాయి. ఆయా పార్టీల అగ్రనేతలు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. తమ ప్రభుత్వ పనితీరు, పథకాలతో కాంగ్రెస్ ప్రచారం చేపట్టింది. ఇక రాష్ట్రంలో మహిళలపై పెరిగిన నేరాలు, అవినీతి, పేపర్ లీకులను లక్ష్యంగా చేసుకొని కమలం పార్టీ పెద్దయెత్తున ప్రచారం చేసింది.

2018 నుంచి కలహాల కాపురమే.

రాజస్థాన్‌లో 2018లో అధికార పీఠమెక్కిన కాంగ్రెస్ వ్యవహారం మొదటి నుంచి కలహాల కాపురంగానే సాగింది. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్నది. సీఎం అశోక్ గెహ్లాట్, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ మధ్య విభేదాలు హస్తం పార్టీకి తలనొప్పిగా మారాయి. వీరిద్దరి వైరం పార్టీని దెబ్బకొట్టే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు అంటున్నారు. ఇండియా కూటమిలోని ఆప్ వంటి పార్టీలు విడిగా పోటీచేస్తున్న నేపథ్యంలో ఇది కాంగ్రెస్ గెలుపోటములపై ప్రభావం చూపుతుందని అంటున్నారు.

కాంగ్రెస్ హామీలన్నీ హుళక్కే!

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడిచింది. ఐదేండ్లు అధికారంలో ఉన్నా హామీల అమలులో హస్తం పార్టీ ఘోరంగా విఫలమైందని, ఏ ఒక్కదాన్నీ సంపూర్ణంగా నెరవేర్చలేదని ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, యువతులకు ఉచిత విద్య, రూ.3,500 నిరుద్యోగ భృతి, రూపాయికే కిలో గోధుమలు, పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు, ప్రతి పంచాయతీకి ఇంటర్నెట్ సదుపాయం తదితర హామీలిచ్చిన ఆ పార్టీ అమలులో చేతులెత్తేసింది. ఉచిత విద్యుత్తు విషయం అటుంచితే గృహ వినియోగ విద్యుత్తు బిల్లులను పెంచేసింది.

బీజేపీకి అసంతృప్తుల భయం

రాష్ట్ర బీజేపీ పూర్తిగా ప్రధాని మోదీ చరిష్మానే నమ్ముకొన్నది. ఇందుకు అనుగుణంగా ఆయన రాజస్థాన్‌లో పెద్దయెత్తున ప్రచార సభల్లో పాల్గొన్నారు. రోడ్‌షోలు చేపట్టారు. మరోవైపు పార్టీలో నెలకొన్న అసంతృప్తి బీజేపీని కలవరపరుస్తున్నది. మాజీ సీఎం వసుంధరా రాజే వర్గీయులకు టికెట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఆమె వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉన్నది. టికెట్ రాని పలువురు నేతలు, వారి అనుచరులు ఏకంగా పార్టీ కార్యాలయాలపైనే దాడులు చేశారు. కొన్నిచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్ ఇవ్వడంపై నిరసనలు వ్యక్తం చేశారు.

బ్రిటన్ వీసాల్లో మనోళ్లదే అగ్రస్థానం

లండన్, నవంబర్ 23: బ్రిటన్ మంజూరు చేసే అన్ని రకాల వీసాల్లో భారతీయుల హవానే కనిపిస్తున్నది. స్టూడెంట్ వీసా, మెడికల్ ప్రొఫెషనల్స్ వీసా, పర్యాటక వీసా ఇలా ఏ క్యాటగిరీలోనైనా భారతీయులే ఎక్కువ వీసాలు దక్కించుకొంటున్నారు. ఈ ఏడాది వీసాల డాటాను (సెప్టెంబర్ 2023 నాటికి) బ్రిటన్ హోం శాఖ విశ్లేషించగా.. ఆరోగ్య రంగ నిపుణులు, స్టూడెంట్ ఇలా పలు క్యాటగిరీల వీసాల్లో భారతీయులే తొలిస్థానంలో ఉన్నట్టు తేలింది. నైపుణ్య కార్మికులు-ఆరోగ్య నిపుణుల వీసాల్లో భారతీయుల సంఖ్య 38,866 ఉండగా.. తర్వాత స్థానాల్లో నైజీరియా (26,715), జింబాబ్వే (21,130) ఉన్నాయి.

ఇద్దరు ఉగ్రవాదుల హతం

మరో జవాన్ వీరమరణం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నది. గురువారం ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిలో ఒకడు పాకిస్థాన్‌కు చెందినవాడు. లష్కరే ఉగ్రవాద సంస్థలో టాప్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. దురదృష్టవశాత్తూ మరో జవాన్ ప్రాణాలు కోల్పోయారు. రాజౌరి జిల్లా కాలాకోట్ అటవీ ప్రాంతం సమీపంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సైనికాధికారులు, ఇద్దరు జవాన్లు అమరులయ్యారు.

యూపీ దవాఖానల్లో మందుల్లేవ్!

- *రోజుల తరబడి రోగుల ఎదురుచూపులు*
- *కేజీఎం మెడికల్ వర్సిటీ టీచర్ల సంఘం ఆందోళన*



లక్నో, నవంబర్ 23: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వ దవాఖానలు, మెడికల్ కాలేజీల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర రాజధాని లక్నోలోని కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ(కేజీఎంయూ) ఫార్మసీల్లో మందుల కొరత నెలకొన్నది. వైద్యులు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్‌లోని మందులు దొరకాలంటే రోగులు దాదాపు నెల రోజుల పాటు వేచి ఉండాల్సి వస్తున్నది. దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సోనియా నిత్యానంద్‌కు కేజీఎంయూ టీచర్స్ అసోసియేషన్ లేఖ రాసింది. యూనివర్సిటీ 'లోకల్ పర్చేజ్' వ్యవస్థ ద్వారా మందులు పొందడంలో ఆలస్యం నెలకొన్నదని, దీని కారణంగా రోగులతోపాటు 570 మంది ఫ్యాకల్టీ సభ్యులు, 9 వేల మంది ఇతర సిబ్బంది, 1500 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నది. ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. అదేవిధంగా మెడికల్ యూనివర్సిటీ కొనుగోలు చేస్తున్న మందుల నాణ్యతపై కూడా అనుమానాలు ఉన్నాయని తెలిపింది. మందులు దొరక్కపోవడంతో బయటి మెడికల్ స్టోర్‌లలో తెచ్చుకోవాల్సి వస్తుందని ఓ రోగి బంధువు పేర్కొన్నారు.

ఆపరేషన్ కోసం డబ్బులు డిమాండ్

లక్నోలోని ఓ ప్రభుత్వ దవాఖానకు చెందిన వైద్యుడొకరు ఓ రోగికి ఆపరేషన్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేశాడన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి బ్రజేశ్ పాఠక్ దర్యాప్తునకు ఆదేశించారు. పారా ఏరియాకు చెందిన ఓ మహిళ గర్భాశయ ఆపరేషన్ కోసం స్థానిక దవాఖానకు వచ్చింది. ఆపరేషన్ ఫీజుగా రూ.400 రశీదు ఇచ్చారని, అయితే సర్జరీ చేయాలంటే అదనంగా రూ.5 వేలు ఇవ్వాలని డాక్టర్ డిమాండ్ చేశారని బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

డబుల్ ట్రబుల్ | ఇంజిన్

లాగిన్ వివరాలు ఎవరికీ ఇవ్వొద్దు

ప్రశ్నోత్తరాలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ సమాధానాలపై గోప్యత పాటించాలి

ఎంపీలకు లోక్‌సభ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా వ్యవహారం నేపథ్యంలో లాగిన్ ఐడీ వినియోగంపై ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియట్ తాజాగా పలు సూచనలు జారీచేసింది. పోర్టల్‌ను ఎంపీలు మాత్రమే యాక్సెస్ చేయాలని, లాగిన్ ఐడీలను ఎవరికీ ఇవ్వొద్దని స్పష్టం చేసింది. ఎంపీలు అడిగే ప్రశ్నలకు ప్రశ్నోత్తరాల సమయం కంటే కొంచెం ముందుగా వారి పోర్టల్ లాగిన్‌లకు పంపే సమాధానాల విషయంలో గోప్యత పాటించాలని నొక్కిచెప్పింది. ఎంపీలు అడిగే స్టార్‌డ్, అన్ స్టార్‌డ్ ప్రశ్నలకు ప్రభుత్వం ఇచ్చే సమాధానాలు లాగిన్, పాస్‌వర్డ్‌లతో రక్షణ కల్పించబడి ఉంటుందని, సభలో ప్రశ్నోత్తరాల సమయం పూర్తయ్యే వరకు వాటిపై గోప్యత పాటించాలని, కంటెంట్‌ను ఎవరితో షేర్ చేసుకోవద్దని లోక్‌సభ సెక్రటేరియట్ ఈ నెల 10న ఇచ్చిన బులెటిన్‌లో స్పష్టం చేసింది. గోప్యత విషయంలో ప్రస్తుతం ఉన్న నిబంధనలనే మహువా ఎపిసోడ్ నేపథ్యంలో లోక్‌సభ పునరుద్ఘాటించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ నుంచి ఎంపీ మహువాను బహిష్కరించాలని ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసిన తర్వాతి రోజునే తాజా సూచనలు జారీ అయ్యాయి.

సుప్రీంకోర్టు తొలి మహిళా జడ్జి ఫాతిమా బీవీ కన్నుమూత

- వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస
- తమిళనాడు గవర్నర్‌గానూ సేవలు



కొల్లాం, నవంబర్ 23: సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి, తమిళనాడు మాజీ గవర్నర్ జస్టిస్ ఫాతిమా బీవీ (96) కన్నుమూశారు. గతకొన్ని రోజులుగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో ఆమె బాధపడుతున్నారు. గురువారం కేరళలోని కొల్లాంలో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె మృతిపట్ల కేరళ సీఎం పినరయి విజయన్, రాష్ట్ర ఆరోగ్యమంత్రి వీణా జార్జ్ సంతాపం వ్యక్తం చేశారు. బాల్యంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని చదువు కొనసాగించారని, కోర్టు మున్సిఫ్‌గా కెరీర్‌ను ప్రారంభించి సుప్రీంకోర్టు న్యాయమూర్తి వరకు ఎదిగారని విజయన్ అన్నారు. తొలి మహిళా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆమె చరిత్ర సృష్టించారని మంత్రి వీణా జార్జ్ అన్నారు. .

అంచెలంచెలుగా..

జస్టిస్ ఫాతిమా బీవీ.. కేరళలోని పతనంతిట్టలో 1927 ఏప్రిల్ 30న జన్మించారు. న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థాయిలో పనిచేసిన మొదటి ముస్లిం మహిళగా ఆమె గుర్తింపు అందుకున్నారు. తిరువనంతపురం వర్సిటీలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత అక్కడి లా కాలేజ్‌లో న్యాయ విద్యను అభ్యసించారు. 1950లో అడ్వొకేట్‌గా నమోదు చేసుకున్నారు. 1958లో కేరళ సబార్డినేట్ జ్యుడీషియల్ సర్వీసెస్‌లో మున్సిఫ్‌గా ఎంపికైన ఫాతిమా బీవీ.. ఆ తర్వాత సబార్డినేట్ జడ్జిగా పదోన్నతి అందుకున్నారు. 1983 నుంచి 1989 వరకు కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. 1989లో దేశంలోనే మొట్టమొదటి సుప్రీంకోర్టు మహిళా న్యాయమూర్తిగా ఎంపికై రికార్డు సృష్టించారు. 1992లో రిటైర్ అయ్యాక, 1997లో తమిళనాడు గవర్నర్‌గా నియమితులయ్యారు.